క్లుప్తంగా

అల్లూరులో అన్నదానం



అల్లూరులో అన్నదానం చేస్తున్న గ్రామస్తులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో సోమవారం కాలినడకన శ్రీశైలానికి వెళ్తున్న కర్ణాటక భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉగాది పండుగకు కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులకు ప్రతి ఏటా గ్రామ పెద్దల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని గ్రామస్తులు వెంకటేశ్వర్లు, తిరుపాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో 9న ఉగాది మహోత్సవం



పంచాంగం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఈఓ

మహానంది: మహానంది ఆలయంలో ఈ నెల 9వ తేదీన ఉగాది మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మహానంది దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీ క్రోధినామ సంవత్సర పంచాంగం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ తంగిరాల వెంకటకృష్ణ ప్రపూర్ణ సిద్ధాంతి చేత పంచాంగం రాయించామన్నారు. దేవస్థానంలోని పబ్లికేషన్ కౌంటర్‌లో భక్తులకు పంచాంగం పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు యరమల మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, ముఖ్య అర్చకులు వనిపెంట ప్రకాశం శర్మ, అర్చకులు శరభయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: మండలంలోని ఎం.లింగాపురం గ్రామంలో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని సీఎస్ఐ సంఘ పెద్దలు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆరుపళ్ల విభాగం పాలబండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. పోటీలలో విజేతలైన వృషభాల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు.

హోం ఓటింగ్‌పై అవగాహన కల్పించాలి

జూపాడుబంగ్లా: 85ఏళ్లు పైబడిన ఓటర్లకు హోం ఓటింగ్‌పై అవగాహన కల్పించి వారు ఇంటివద్దనే మొబైల్ పోలింగ్‌కేంద్రంలో ఓటు వేసేలా బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలని నోడల్ అధికారి, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు హోం ఓటింగ్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఎస్ఓ హనుమంతు, ఆర్ఐ శ్రీరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలు దగ్ధం

ఆత్మకూరు: పట్టణ శివారులోని భవనాశి వాసు సమీపంలో వివిధ పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు సంబంధించిన పండ్ల తోటలు దగ్ధం కావడంతో రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారు. పండ్ల తోటలకు చెందిన యజమానులు అలీఅక్బర్, మాసుంవలి, షఫీవుల్లా, సాయబా, గఫూర్, ఫరూక్, అయూబ్, మాబుమియా, గౌస్, మగ్బుల్, మున్నాలకు చెందిన ఆరు ఎకరాలు పండ్ల తోటలు దగ్ధమయ్యాయి. ఇందులో రూ.2లక్షలు విలువ చేసే అరటి తోట, రూ.లక్ష విలువ చేసే తమల పాకు తోటలు మంటలో కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

శివాలయంలో పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు కొప్పరపు రవిప్రసాద్, పద్మావతమ్మ సోమా బాలాజీ ఆధ్వర్యంలో స్వామి వారికి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బంగారు ఉంగరం అప్పగింత

మహానంది: గిద్దలూరుకు చెందిన శివకుమార్, కుటుంబ సభ్యులు సోమవారం మహానందికి వచ్చారు. కోనేరులో స్నానాలు ఆచరిస్తుండగా శివకుమార్ ఉంగరం పడిపోయింది. బయటికి వచ్చిన భక్తులు చూసుకుని ఉంగరం పోయిన విషయం గుర్తించారు. వెంటనే వారు దేవస్థానం ఉద్యోగుల దృష్టికి తీసుకురాగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెతికించి అప్పగించారు. దీంతో బాధిత భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

డిప్యూటేషన్‌పై నియామకం

మహానంది: మహానంది దేవస్థానం నుంచి కాణిపాకం ఆలయానికి బదిలీ అయిన సీనియర్ అసిస్టెంట్ శశిధర్‌రెడ్డి డిప్యూటేషన్‌పై తిరిగి మహానంది ఆలయానికి వచ్చారు. సోమవారం ఆయన ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందించారు. మహానందిలో రెండు సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా ఓ స్థానం శశిధర్‌రెడ్డికి కేటాయించనున్నారు.

అవ్వాతాతలకు మళ్లీ పింఛన్ కష్టాలు

నా పరిస్థితి ఏమిటి.. నాకు పింఛన్ ఎవరందిస్తారు?



నా పేరు చాంద్‌బాషా. 13వ సచివాలయం పరిధిలోని 20వ వార్డులో కొత్త పీర్ల వీధి లో మా ఇల్లు ఉంది. పక్షవాతంతో మంచాన పడ్డాను. 1వ తేదీ వచ్చిందంటేనే నేరుగా ఇంటికి పింఛన్ వస్తుందని ఆనందంగా పొంగిపోయే వాడిని. ఈ రోజు పింఛన్‌కోసం ఎదురు చూశాను. తీరా వలంటీర్లు వచ్చి పింఛన్ ఇవ్వరని, సచివాలయం వద్దకు వెళ్లాలని వేరేవాళ్లు చెప్పారు. మాకు వలంటీర్ల ద్వారా పింఛన్ ఇవ్వొద్దని చంద్రబాబు ఫిర్యాదు చేయడం వల్ల పక్షవాతంతో బాధపడుతున్న నేను సచివాలయం వద్దకు వెళ్లాల్సి వస్తుంది. నన్ను ఎవరు తీసుకెళ్తారు. అక్కడ ఎంతో ఇబ్బందిగా ఉంటుంది. నా పరిస్థితి దారుణంగా ఉంది. మంచంలోంచి కదల్లేని దుస్థితి. పిల్లలు సహకరించకపోతే నేను కదిలే పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా పింఛన్ ఇంటికి తెచ్చివ్వడంతో సంతోషించే వాళ్లం. చంద్రబాబునాయుడుకు మా లాంటి వాళ్ల మీద అక్కసెందుకు. ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారు.



టీడీపీ పాలనలో జూపాడుబంగ్లా పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్‌కోసం పడిగాపులుగాస్తున్న వృద్ధులు (ఫైల్)

- పింఛన్లు వలంటీర్లతో పంపిణీ చేయించవద్దని ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- రేపటి నుంచి గ్రామసచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేయనున్న కార్యదర్శులు
- పింఛన్ కోసం మళ్లీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి
- ఈసీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటున్న లబ్ధిదారులు
- చంద్రబాబుకు పింఛన్‌దారుల శాపనార్థాలు

జూపాడుబంగ్లా: చంద్రబాబునాయుడు పాలనలో పింఛన్‌దారులు ప్రతి నెలా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద తిండీతిప్పలు మానుకొని రోజుల తరబడి వేచి ఉండి పింఛన్ మొత్తం తీసుకునేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీరు వ్యవస్థను అమలుచేసి వారి ద్వారా ప్రతి నెలా దివ్యాంగులు, అవ్వా, తాతలు, అక్కా, చెల్లెమ్మలకు ఒకటోవ తేదీన తెల్లవారకముందే ఇంటితలుపులు తట్టి పింఛన్ నగదు చేతుల్లో పెడుతుండటంతో వారి మోములో ఆనందం వెల్లివిరిసేది. తన మనుమడు, తన పెద్దకొడుకు, తన తమ్ముడు లాంటి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటివద్దకే పింఛన్ పంపిస్తుండటంతో పింఛన్‌దారులు ఆయనను వేనోళ్లకొనియాడేవారు. దీన్ని చూసి జీర్ణించుకోని చంద్రబాబునాయుడు ఎప్పుడూ వలంటీర్లపై అక్కసు వెళ్లగక్కేవాడు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

చంద్రబాబు ఫిర్యాదుతో..

ఏప్రిల్ నెల పింఛన్లను వలంటీర్లతో పంపిణీ చేయించకుండా ఆదేశాలు జారీ చేయాలంటూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయించాడు. దీంతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్నికలు ముగిసేవరకూ పింఛన్లు వలంటీర్లు పంపిణీ చేయటానికి వీల్లేదంటూ ఆదేశాలు జారీచేసింది. దీంతో అధికారులు ఈనెల 3 నుంచి గ్రామ/వార్డు సచివాలయాల వద్ద సిబ్బంది ద్వారా పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఏప్రిల్ నెల పింఛన్లు పింఛన్‌దారుల ఇళ్లవద్దకు రాకుండా చంద్రబాబునాయుడు అడ్డుకట్టవేసినట్లయ్యింది. మళ్లీ చంద్రబాబు పాలనలో లాగా సచివాలయాల వద్ద వేచివుండాల్సిన పరిస్థితి దాపురించిందని నడవలేని అవ్వా,తాతలు, దివ్యాంగులు చంద్రబాబుతీరును తూర్పారబడుతూ తమను ఇబ్బంది పెడితే మా ఉసురు ఊరికేపోదు నాశనమైపోతాడంటూ శాపనార్థాలు పెడుతున్నారు. ఇంటివద్దకు పింఛన్ పంపిణీ నిలిపివేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తే వాళ్లకి కడుపుమంట



ఒకటో తేదీ మధ్యాహ్నం అయ్యింది. వలంటీర్ ఇంకా పింఛన్ ఇవ్వలేదని ఇంటికాడికి పోయినా. ఈ నెల మేము ఇవ్వడం లేదు పెదనాన్న, ఎన్నికల కోడ్ వచ్చింది. మేమివ్వకూడదని అని చెప్పింది. అర్థం కాలేదు. పింఛన్ ఇస్తే తెలంగాణలో ఉన్న నా చిన్న కొడుకు దగ్గరకు పోవాలనుకోయింటి. వేరే వాళ్లనడిగితే చంద్రబాబు నాయుడు వాళ్లు ఏదో కేసు వేసినారంట కదా, వలంటీర్లు పింఛన్ పంచకూడదని. ఇదెక్కడి న్యాయం నయనా. ముసలోళ్లు ఇబ్బంది పడకుండా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తుంటే వాళ్లకు కడుపు మంటనా ఏమి. మల్లా ఇప్పుడు అప్పటిలెక్క కాళ్లీడ్చుకుంటూ పింఛన్ డబ్బుల కోసం పోయి ఎదురు సూసుకుంటూ కూసోవాల్నా ఏమి. ఇదెక్కడి ఖర్మరా బాబు. ముసలోళ్ల కోసం మంచి చేసినోళ్లను ఎప్పటికీ మర్చిపోలేము నాయనా, అట్నే చెడు చేసినోళ్లను కూడా మర్చిపోమయ్యో.

–నాగన్న, వృద్ధాప్య పింఛన్ దారుడు, పాములపాడు

టీడీపీ పాలనలా మళ్లీ పడిగాపులు కాసే దుస్థితి



ఉదయమే వృద్ధాప్య పింఛన్ వస్తుందని ఎదురు చూశాను. వలంటీర్ రాకపోవడంతో ఎందుకు రాలేదని కాలనీ వలంటీర్‌ను అడిగాను. అధికారులు మాకు పింఛన్ ఇవ్వొద్దని చెప్పారు. అందుకే మేము రాలేదన్నారు. ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేశారని తెలిసింది. ఆయన పాలనలో పింఛన్ కోసం గంటల తరబడి పడిగాపులు కాశాం. పొద్దున 7గంటలకు పోతే రాత్రి 8గంటలైనా పింఛన్ చేతికి వచ్చే పరిస్థితి ఉండేదికాదు. గ్రామ సచివాలయం వద్ద చెట్ల కింద కుర్చునేవాళ్లం, అన్నం తినేందుకు కూడా పోయే వాళ్లం కాదు. వలంటీర్ల పుణ్యమా అని 1వ తేదీ పొద్దున్నే పింఛన్ ఇచ్చే వాళ్లు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేలా చేసినందుకు సంతోషించాము. చంద్రబాబునాయుడు ముసలోళ్ల మీద పడినాడు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిందేనేమో. ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చేంత వరకు మాకీ పరిస్థితి తప్పదేమో.

– నాపేరు గొల్ల నాగశేషులు, వాకిలి పేట, ఆత్మకూరు

మా ఉసురు తగులుతుంది



నేను, నా కుమార్తె ఇద్దరం దివ్యాంగులం. మాకు ప్రతి నెలా వలంటీరు ఇంటివద్దకు వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చి వెళ్లేవారు. చంద్రబాబునాయుడు వలంటీర్లతో పింఛన్ పంపిణీ చేయించవద్దని పెద్దసారోళ్లకు ఫిర్యాదు చేయడం పద్ధతిగాలేదు. సచివాలయం వద్దకు వెళ్లి గంటల తరబడి తిండీ తిప్పలు మానుకొని పింఛన్ కోసం వేచిచూడాల్సి ఉంటుంది. మాబోటి వారిని ఇబ్బంది పెడితే ఉసురుతగులుతుంది.

– లక్ష్మీదేవి, జూపాడుబంగ్లా

నేను ఎక్కడున్నా వచ్చి చేతిలో డబ్బులు పెట్టేవారు



నాఅన్నవారెవ్వరూ లేని నాకు వలంటీరు పింఛన్ వచ్చేలా చేశాడు. ప్రతి నెలా నేను ఎక్కడున్నా వెతికి మరీ నా చేతిలో డబ్బులు పెట్టివెళ్లేవాడు. అలాంటిది చంద్రబాబు నాయుడు ఇళ్లవద్దకు పింఛన్ రాకుండా చేయడంతో 60ఏళ్లు పైబడిన నేను పంచాయతీ ఆఫీసు వద్దకు వెళ్లి తీసుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ఇళ్లవద్దకే పింఛన్ తెచ్చి ఇచ్చే పద్ధతిని కొనసాగించాలి.

– దూదేకుల గాలయ్య, జూపాడుబంగ్లా

మానసిక వికలాంగురాలైన బిడ్డను ఎలా తీసుకెళ్లేది



నా బిడ్డ శ్రీజ మానసిక వికలాంగురాలు. నెల నెలా వలంటీరు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవాడు. ఇప్పుడు సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటున్నారు. మానసిక వికలాంగురాలైన నా బిడ్డను తీసుకొని పింఛన్ కోసం సచివాలయం వద్దకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలి.

– యమునాదేవి, బాధితురాలి తల్లి

నా పెద్దకొడుకు జగనే మళ్లీ సీఎం కావాలి



నాపెద్దకొడుకు లాంటి జగనన్న రూ.3వేల పింఛన్ డబ్బులను ప్రతి నెల ఇంటికి పంపించేవాడు. ముసలొళ్లను తల్లుల్లా చూసుకుంటున్న జగనే మళ్లీ సీఎం కావాలి. చంద్రబాబు దాన్ని అడ్డుకోవడం దుర్మార్గం. మాబోటి ముసలొళ్లను కష్టపెడితే ఉసురుకొట్టుకుపోతాడు. చంద్రబాబు పాలనలో పింఛన్‌కోసం సచివాలయం వద్ద రోజుల తరబడి తిండీ తిప్పలు మానుకొని కూర్చొనేవాళ్లం. ఇప్పుడు అదే పద్ధతిలో పింఛన్ ఇస్తామనడం బాగా లేదు. ఇంటివద్దకే పింఛన్ వచ్చేలా చేయాలి.

– చంద్రమ్మ, వృద్ధురాలు

ఆఫీసువద్దకు వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోగలను



వికలాంగుడినైన నేను పంచాయతీ ఆఫీసు వద్దకు వెళ్లి ఎలా పింఛన్ తెచ్చుకోగలను. ఇంటివద్దకు వలంటీరు వచ్చి పింఛన్ ఇచ్చే పద్ధతి ఎంతో బాగుండేది. అలాంటిది ఇంటివద్దకు పింఛన్‌రాకుండా చేసిన వారికి పుట్టగతులుండవు. మాబోటి వారి కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంటివద్దకు వచ్చి పింఛన్ పంచేలా చేయాలి.

– మాసుం, మండ్లెం

పక్షవాతం వచ్చిన నేను ఆఫీసు వద్దకు వెళ్లాలంటే ఇబ్బంది



నాకు పక్షవాతం వచ్చింది. సక్రమంగా నడవలేను ప్రతి నెలా వలంటీరు ఇంటి వద్దకు వచ్చి పింఛన్ సొమ్ముచేతిలో పెట్టేవాడు. ఇప్పుడు పింఛన్ పంచాయతీ ఆఫీసు వద్ద ఇస్తామంటున్నారు. సక్రమంగా నడవలేని నేను పంచాయతీ ఆఫీసువద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు తెచ్చుకోవాలంటే ఇబ్బంది కరంగా ఉంటుంది. మా కష్టాన్ని చూసి వెంటనే ఇంటివద్దకు పింఛన్ డబ్బులు పంపిణీ చేసేలా చేయాలి. – శివన్న, తాటిపాడు

మా శాపం తగులుతుంది



వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీనే మా ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఆఫీస్ కాడికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంటున్నారు. మాలాంటోళ్లపై రాజకీయాలు ఎందుకు?..మా శాపం తగులుతుంది. ఇలాంటోళ్లకు ఓట్లెందుకు వేస్తాం. –ఈ.పుల్లమ్మ, లక్ష్మీనగర్, వెలుగోడు

అన్ని వర్గాలకు న్యాయం జగనన్నతోనే సాధ్యం

పాములపాడు: రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుండాలనట్టు గ్రామంలో సుగాలితండా పెద్దలు రాజునాయక్, విజయ్‌నాయక్‌లను కలిశారు. అనంతరం తండా వాసులతో శాప్ చైర్మన్ మాట్లాడుతూ.. సామాన్యులకు కూడా అసెంబ్లీలో అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే సీట్లు కేటాయించిన మహోన్నత వ్యక్తి జగనన్న అని కొనియాడారు. ఈ రెండు నెలల పాటు అందరం కలిసికట్టుగా కష్టపడి ఫ్యాన్ ప్రభంజనాన్ని మరొకసారి చాటుదాం అని పిలుపునిచ్చారు. టీడీపీ వారు చెప్పే బూటకపు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి చేసిందేమి లేదని, తానేమి చేశానో చెప్పుకునే దమ్ము లేదని విమర్శించారు. అయితే తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ కుటుంబంలో మేలు జరిగింటేనే ఓటు తనకు వేయండని విశ్వాసంతో దమ్ముతో చెబుతున్నాడని గర్వంగా చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం నాయకులు చంద్రమౌళి, మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, విజయసింహారెడ్డి, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న రాష్ట్ర శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

పాములపాడు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా మండలంలోని వేంపెంట గ్రామంలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలను నిర్వహించగా, శాప్ చైర్మన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాలకు కొదవ లేదని నమ్మారన్నారు. అందుచే ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహించి గ్రామీణ క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో మెరిసేలా చేశారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, రామలింగేశ్వరరెడ్డి, విజయసింహారెడ్డి, రమణారెడ్డి, క్రిష్టారెడ్డి, చలమారెడ్డి, మధుసూదన్‌రావు, ఏసురత్నం, వరప్రసాదరావు, చౌడయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలంతా మాయ

- టీడీపీ వారికే కండువాలు కప్పి భారీ చేరికలంటూ దుష్ప్రచారం
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీలో చేరికలు చూస్తుంటే మయసభను తలపించేలా ఉన్నాయని, ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లుగా ఆ పార్టీ చేరికలు ఉన్నాయని, పట్టుమని పది మంది కూడా చేరకపోతే వందల కుటుంబాలు చేరినట్లు చూపించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో తిరుపతిరావుపేట, ఇందిరేశ్వరం, సిద్ధపల్లి గ్రామాల్లో టీడీపీ చేరికలు చూస్తుంటే నవ్వు వస్తుందన్నారు. మైనర్ పిల్లలను, బ్యాండ్ వాయించేవాళ్లకు కూడా కండువాలు కప్పుతూ భారీ చేరికలు అంటూ ప్రతిపక్ష పార్టీ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చూపడం హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఇందిరేశ్వరం గ్రామంలో కేవలం నలుగురు మాత్రమే వైఎస్సార్‌సీపీ వారు టీడీపీలో చేరితే 150 కుటుంబాలు డబ్బా కొట్టుకుంటున్నారని, ఆ గ్రామంలో అన్ని కుటుంబాలు లేవు కదా అని ప్రశ్నించారు. కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీలో చేరాలని, పార్టీని వీడి కార్యకర్తలు ఒకరిద్దరు చేరితే పెద్ద ఎత్తున అంటూ చెప్పుకుంటూ.. చివరకు కూలీలకు డబ్బులు ఇచ్చి మీటింగ్‌లకు పిలిపించుకొని పార్టీ కండువా వేసి గొప్పలు చెప్పుకుంటున్నారని, ఇది చెల్లికి మళ్లీ మళ్లీ పెళ్లి అన్న చందంగా కొనసాగుతుందన్నారు. శ్రీపతిరావుపేటలో ఆరు మంది, సుద్ధపల్లిలో 10 కుటుంబాలు చేరితే వందల సంఖ్యల్లో చేరినట్లు చెప్పుకోవడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన మాబాషా మాట్లాడుతూ తాము పది మంది గతంలో టీడీపీలో చేరామని, తమ గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి తిరిగి పార్టీలోకి రావడంతో తాము టీడీపీని వీడి తిరిగి వైఎస్సార్‌సీపీలో 100మంది కుటుంబాలతో చేరుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బాలస్వామియాదవ్, నాయకులు కువ్వాడ భాస్కర్, విజయచౌదరి, కలీముల్లా, నారాయణరెడ్డి, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాలి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పేదల గడప వద్దకే సంక్షేమ పథకాలు రావాలంటే జగనన్ననే మళ్లీ సీఎంను చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. సోమవారం మండలంలోని సింగరాజుపల్లె, పెద్దగుమ్మడాపురం, చిన్నగుమ్మడాపురం గ్రామాలలో మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దిరాల రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దారా సుధీర్ ఇంటింటికి తిరుగుతూ ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అదేవిధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రి చేసుకునేందుకు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడి గడప వద్దకు సంక్షేమ పథకాలు రావాలన్నా, గ్రామాలలో అభివృద్ధి పనులు జరగాలన్నా జగన్‌మోహన్‌రెడ్డిని 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అందుకోసం ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ, వంటి పార్టీలు ప్రజలను మభ్యపెట్టి ఏలాగైనా అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించేందుకు దొంగ హామీలు ఇస్తారని, వారిని నమ్మితే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి, సింగల్‌విండో మెంబర్ అచ్చిరెడ్డి, కో-ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్‌గౌస్, ఎంపీటీసీ శివన్న, సర్పంచ్‌లు విజయ్‌కుమార్, బాల ఎల్లయ్య, ఆలయ చైర్మన్ వెంకటనాయుడు పాల్గొన్నారు.

మెజారిటీ కోసం కష్టపడాలి



యువత, స్థానికులతో సమావేశమైన కార్తీక్‌రెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: వచ్చేనెలలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ విజయం తథ్యమని శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ నాయకుడు శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కార్తీక్‌రెడ్డి సున్నిపెంటలోని వెస్ట్రన్‌కాలనీలో యువతతో సమావేశమయ్యారు. శిల్పా చక్రపాణిరెడ్డి సామాజిక సేవ వలన శ్రీశైలం నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు భరత్‌రెడ్డి, బి.మల్లి, ఎం శివ, పి శరత్, పానుగంటి రాజు, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని దేవనూరు గ్రామానికి చెందిన గోవిందు అనే వ్యక్తి గ్రామంలో నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ జగన్‌మోహన్ సోమవారం తెలిపారు. అలాగే నాగలూటి గ్రామానికి చెందిన దేవదానం అనే వ్యక్తి నుంచి 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సారా విక్రేత అరెస్ట్

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన మేకల బుజ్జిని అరెస్ట్ చేసి ఇరవై లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. అలాగే ఆరు వందల లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

మహానందిలో శ్రీశైలం ఈఈ పూజలు

మహానంది: శ్రీశైలం దేవస్థానం ఈఈ రామకృష్ణ, డీఈ సుబ్బారెడ్డి సోమవారం మహానందికి వచ్చారు. వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

అవి-ఇవి

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

మహానంది/వెలుగోడు: బండిఆత్మకూరు, వెలుగోడు మండలాల్లో బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీఓలు విజయరావు, శ్రీనివాసరెడ్డి తెలిపారు. వలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయం సిబ్బంది చేత పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

చురుగ్గా ఉపాధి హామీ పనులు

వెలుగోడు: జాతీయ జాతీయ గ్రామీణ ఉపాధి పనులు మండలంలో చురుగ్గా సాగుతున్నాయని ఏపీఓ మల్లికార్జున తెలిపారు. మండలంలోని అబ్దుల్లాపురం, బోయరేవుల గ్రామాల్లో మినహా మిగతా అన్ని గ్రామాల్లో మట్టి పూడిత తీత, పంట కాల్వ పనులు జరుగుతున్నాయని చెప్పారు. సోమవారం ఏపీఓ ఉపాధి పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో 1,131 మందికి ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా ప్రస్తుతం 2,031 మంది కూలీలు పని చేస్తున్నారని చెప్పారు. టార్గెట్‌కు మించి పనులు కల్పిస్తున్నామని తెలిపారు.

ఆలయ భూముల వేలం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని శ్రీ పార్వతీ సమేత తాండవ మల్లేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి వార్ల దేవస్థానాలకు చెందిన భూముల బహిరంగ వేలం పాటను సోమవారం నిర్వహించారు. ఈఓ కార్తీక్ మాట్లాడుతూ ఈ రెండు దేవస్థానాలకు ఉన్న సుమారు 58 ఎకరాలను సంవత్సర కాలానికి వేలంపాట వేశామన్నారు. వేలంపాటలో రూ.5,60,000లు ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది వేలంపాట నిర్వహించగా రూ.3,83,000 వచ్చిందని తెలిపారు. దీంతో గతేడాది కంటే ఈ ఏడాది రూ.1,80,000 అధిక ఆదాయం వచ్చిందన్నారు.

శ్రీశైలంలో పార్టీ గుర్తులతో ప్రచారం చేయరాదు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం గ్రామం దేవదాయశాఖ పరిధిలో ఉన్న కారణంగా ఏ రాజకీయపార్టీ వారైనా పార్టీ కండువాలు, పార్టీ గుర్తులు ధరించి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని తహసీల్దార్ గుర్రప్ప తెలిపారు. సోమవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని శ్రీశైలం, సున్నిపెంట, లింగాలగట్టు గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేయాలనుకుంటే కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని వెళ్లాలన్నారు. సమావేశంలో ఆర్ఐ రవి, వీఆర్ఓ నాగచంద్రుడు, సాయి, సీఐ రమేష్‌కుమార్, ఎస్ఐ గంగయ్యయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రజాక్, దానియేల్, టీడీపీ నాయకులు మైలా శ్రీను, అడుసుమల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సామగ్రిని అప్పగించిన వలంటీర్లు

శ్రీశైలంప్రాజెక్ట్: ఎలక్షన్ కమిషన్ నిర్ణయం మేరకు సోమవారం శ్రీశైలం మండలంలోని గ్రామ వలంటీర్లు ప్రభుత్వం తమకిచ్చిన సామగ్రిని పంచాయితీ కార్యదర్శి బాలూనాయక్‌కు అప్పగించారు. గ్రామసచివాలయం-2, గ్రామసచివాలయం-4లో మండలంలోని వలంటీర్లందరూ ఫోన్‌లు, సిమ్‌కార్డులు, ఫింగర్ ప్రింట్ మిషన్‌లను డిపాజిట్ చేశారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

శ్రీశైలంప్రాజెక్ట్: విద్యుత్ వినియోగంపై గిరిజన గురుకుల విద్యార్థులు సోమవారం సున్నిపెంట వీధుల్లో ప్రిన్సిపాల్ జాన్‌మెస్సయ్య ఆధ్వర్యంలో బ్యానర్లతో ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని నినాదాలు చేశారు. అవసరమున్నప్పుడే విద్యుత్ వినియోగించాలని, తరువాత స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతుల అందజేశారు.